# పుత్రవంచన

రాత్రి రైలెక్కినప్పటి నుంచీ కొడుకు కోసమే కలవరిస్తున్న రామబ్రహ్మం గారికి ఆ మహాసాగరం లాంటి వీ.టీ. స్టేషన్‌లో కొడుకు కనపడకపోయేసరికి మనసు చివుక్కుమంది. ఆయన హతాశుడే అయి పోయినాడు. ఏం చేయడానికీ పాలుపోలేదు. కంపార్టుమెంటు దగ్గరకు వస్తాడేమోనని కాంతి తెచ్చుకున్నాడు కళ్ళనిండా. తనకు చేయి అందిచ్చి 'జాగ్రత్త నాన్నా! భద్రం. భద్రం, ఇదుగో, ఇట్లా, ఇట్లా కాలు పెట్టు' అంటాడనుకున్నా రాయన. 'శాంతనుకూడా తీసుకొని రావల్సింది నాన్నా! నాలుగు రోజులుండి పోయేది కదా? బొంబాయి చూసినట్లు కూడా ఉండేది. పెళ్ళైపోతే ఆ బావగారు మనింట్లో దాన్ని నాలుగు రోజు లుండనిస్తాడా?' అని నవ్వుతాడని, ఇట్లా ఏమిటేమిటో ఊహించు కున్నాడాయన కొడుకు రాజగోపాలాన్ని గూర్చి. పరవాలేదు, రాత్రి రైల్లో ఓ కునుకుపట్టింది. సౌకర్యంగానే ఉంది. అయితే, మనసు నిండా రాజే నిండిపోయాడు. రామరక్షాస్తోత్రం మనసులో మొదలెట్టగానే మొదటి శ్లోకం కూడా పూర్తి కాకుండానే రాజు చిన్నప్పటి సంగతులన్నీ రామబ్రహ్మంగారిని ఉక్కిరిబిక్కిరి చేసేవి.

తనతో ఎదుటి బెర్తుమీద ప్రయాణం చేసిన మార్వాడీ కుర్రాడు చేయి పట్టుకొని జాగ్రత్తగా ప్లాట్‌ఫారం మీదికి దించాడు. హిందీ తనకు అర్థం అవుతుంది కాని, బదులు చెప్పలేదు. ఆ పిల్లాడే తడ బడుతూ ఇంగ్లీషులో అడిగాడు 'ఎక్కడికి వెళుతున్నారు? నా సహాయం ఏమైనా కావాలా?' అని. రామబ్రహ్మంగారికి సిగ్గయింది. 'అక్కర్లేదు. మావాళ్ళు వస్తారు' అన్నాడు. చిన్న బెడ్డింగూ, గొడుగూ మాత్రమే

ఉన్నాయి తనతో. ఎక్కడికి వెళ్ళినా గొడుగు వెంట ఉండటం బాగా అలవాటైపోయింది. చిన్నప్పటినుంచీ అంతే. గొడుగు వెంట ఉండక పోతే ఆయనకు తోచదు.

కొడుకు కంపార్టుమెంట్ కోసం వెతుకుతున్నాడేమోనని రామ బ్రహ్మంగారు కొంచెం ఎడంగా నింపాదిగా నిలుచున్నాడు. ప్రయాణీకు లంతా హడావుడిగా వెళ్ళిపోతున్నారు. తాను ఒంటరిగా ఉండిపోతున్న ట్లనిపించింది. రాజగోపాలం ఎందుకు రాలేదు? తాను మూడు ఉత్తరాలు రాశాడు. ఫలాని రోజు ఫలాని రైల్లో వస్తున్నానని కూడా రాశాడు. రైలు దగ్గరకు కొడుకు తప్పకుండా వస్తాడనే అనుకున్నాడు తాను.

పది నిముషాలు గడిచాయి. పావుగంట గడిచింది. కాళ్ళలో ఏదో బలహీనత అనిపించింది. బొంబాయి తాను ఎరగకపోడు. అయితే, నలభై ఏళ్ళైపోయింది తాను చూసి. పైన ఇప్పుడెవరైనా తోడుంటే బాగుండుననిపించే రోజులు. ప్రయాణికుల టిక్కెట్లు వసూలు చేసేచోట తనకోసం ఎదురుచూస్తున్నాడేమో రాజగోపాలం! ఆయన ముందుకు కదిలాడు. అడుగులు తడబడ్డాయి. ఇదేమిటి? ఇలా ఎందుకు జరిగింది? ఇట్లా జరుగుతుందని ఎప్పుడూ అనుకోలేదే తాను!

"మీరు రామబ్రహ్మంగారేనా?" జారిపోతున్న కళ్ళజోడును సవరించుకొని, అట్లా అడిగిన ఎదుటి వ్యక్తివైపు చూశాడాయన.

"గోపాల్ జీ చెప్పిన దానికి పూర్తిగా సరిపోయింది. మీరు రామ బ్రహ్మంగారే కావాలి!" అన్నాడు ఎదుటి వ్యక్తి.

"నేను ఫస్టు క్లాస్ కంపార్టుమెంట్ దగ్గర చాలాసేపు చూశాను. అయ్యగారు నాకు మీరు సెకండ్ క్లాస్‌లో వస్తారని చెప్పలేదు. పోదాం రాండి. నేను గోపాల్ జీగారి గుమాస్తాను. బయట కారు రెడీగా ఉంది."

మోకాళ్ళదాకా వచ్చిన ప్రవాహంలో అడుగున ఇసుక పాదా లను కోసేస్తున్నప్పుడు ఒక్కసారి చీలమండల దిగువకు నీటి ఉరవడి

తగ్గిపోయినట్లు ఊపిరి పీల్చుకున్నారు రామబ్రహ్మంగారు. ఆ వ్యక్తిని ఎగాదిగా చూశారు కృతజ్ఞతతో. అతడు తన చేతిలోని బెడ్డింగును అందుకుంటాడేమో ననుకున్నారు. కాని, ఆ వ్యక్తి అదేమీ పట్టించుకోలేదు.రాండి వెళదాం అంటే ఆయన మనసు మరింత చిన్నబోయింది. నెమ్మదిగా ఆ వ్యక్తి వెనకాలే నడిచాడు.

కారులో కూచున్న తరువాత ఆ గుమాస్తా "అయ్యగారికి పొద్దున చాలా ముఖ్యమైన కాన్ఫరెన్స్ ఉందట. లేకపోతే ఆయనే వచ్చేవారేమో! కాదు కాదులెండి! అదెట్లాగూ కుదరదు. ఆయనకు ఏ రోజూ క్షణం తీరిక ఉండదు. ఎవరో ఒకరు కంపెనీ మీటింగులకు పిలుస్తూ ఉంటారు. లేదా ఏరోడ్రోముకు వెళుతుంటారు. క్లబ్బుకు పోవటానికి కూడా ఆయనకు తీరిక ఉండదు" అంటూ చెబుతున్నాడు.

రామబ్రహ్మంగారికి సంతోషమనిపించింది కాని, అసంతృప్తి కూడా బాధించింది. కార్లో వెళ్లటానికే గంటసేపు పట్టింది. మున్నాలాల్ తనవెంట లేకపోతే తాను ఈ బ్రహ్మాండమైన భవనాన్ని కనుక్కోలేక పోయేవాడే. లిఫ్టులో చెప్పాడు మున్నాలాల్- పదకొండంతస్తులలో ఆరవ అంతస్తట. నాలుగూ నాలుగూ ఎనిమిది వరసలట.

ఉదయం పదకొండు గంటలైంది. 'స్నానం చేస్తారా? భోజనం వడ్డిస్తాను' అంది సంధ్య ఆప్యాయంగానే. జ్యోతి, జ్యోత్స్న కాన్వెంటుకు వెళ్ళారుట. ఆయన సోఫాలో కూచుండిపోయారు. "నా భోజనానికి ఇంకా గంట ఆలస్యముంటుంది. కాస్త కాఫీ ఇవ్వు" అన్నారు. అలా అడగటానికి రామబ్రహ్మంగారికి మొహమాట మనిపించింది. మళ్ళీ "తన కొడుకూ, కోడలూ!తానేమో ఎవరో చుట్టాలింటికి రాలేదు. ఎందుకు సంకోచం?"అనిపించింది.కాని తన కోడలే అడగాల్సింది కదా- "మామగారూ! కాఫీ తీసుకున్నారా ఇవాళసలు. ఇప్పుడు తీసుకుంటారా?" అని.

గోపాలం ఎప్పుడొస్తాడని ఆయన అడిగారు. పోనీ, వాడికి తీరిక లేకపోతే సంధ్య అయినా రావచ్చు కదా స్టేషనుకు? రాలేదు. ఎందుకు రాలేదు? అని కోపంగా అడగాలనిపించింది ఆయనకు. అడిగి ఏం ప్రయోజనం! జరగవలసిందేదో జరిగింది. జరిగేపోయింది.

"ఆయన ఎప్పుడు వస్తారో ఆయనకే తెలియాలి. ఒక వేళాపాళా లేదు. ఇంత మహాపట్నంలో వ్యవహారాలన్నీ ఆయనకే కావాలి" అంది కోడలు మెటికలు విరిచినట్లు. నిజమే కావచ్చు. ఆ ధోరణిలోనా తనకు సమాధానం చెప్పాల్సింది? "వచ్చేస్తారు మామయ్యగారూ! మీరు నాలుగు మెతుకులు తిని, కాస్త నడుం వాల్చండి" అనకపోగా, ఈ విడ్డూరపు మాటలెందుకు? స్నానం చేసి కాసేపు జపం చేసుకున్నారాయన. కాఫీ చల్లబడిపోయిన సంగతి కోడలు పట్టించుకోలేదు.

మూడు గంటలప్పుడు రాజగోపాలం గొంతు వినిపించి తనకు మెళకువ వచ్చింది. బహుశా కొడుకు కంఠం వినబడుతుందేమోనని తాను నిద్రపోతున్నా చెవులు మాత్రం మేల్కొని ఉండి ఉంటాయి. భార్యతో కాన్ఫరెన్స్ కబుర్లేవో చెబుతున్నాడు. 'నాన్న వచ్చారా? ఏమన్నారు? ఎన్నింటికి భోంచేశారు?' అని తనగూర్చి అడుగుతాడేమో ననిపించింది. కాని, ఆ మాటలు వాళ్ళ మధ్య రాలేదు. బహుశా ఇంటికి రాగానే అడిగి ఉంటాడు. ఇప్పుడు కదా తనకు మెళుకువ వచ్చింది! తన దగ్గరకు రాడేం?"నిద్ర లేచారా నాన్నా? అనడేం?" రామబ్రహ్మం గారు ఉద్వేగంతో ఉక్కిరిబిక్కిరైనారు.

"వారం రోజులుంటారా?" అని అడుగుతోంది కోడలు - తన గురించే కాబోలు. ఏమిటా ప్రశ్న? అసందర్భంగా. వాళ్ళ నాయన ఇంటికి కాదు కదా తను వచ్చింది! వాళ్ళాయన ఇంటికి. తనకున్న హక్కు తనకు లేదా!

"ప్రయాణం చేయటం కష్టం కదా! ఈ వయసున ఇప్పుడెందుకు వచ్చారు?" అని అడుగుతోంది.

"ఏమో నాకేం తెలుసు? రేపు నువ్వే అడుగుదుగానిలే! మనం తెనాలి వెళ్ళి రెండేళ్ళు దాటుతోంది కదా! చూసి పోదామని వచ్చి ఉంటారు."

"ఇంకా నయం. బొంబాయి చూసి పోదామని అనలేదు. నా అనుమానం ఏమిటంటే డబ్బేదో అడుగుదామని వచ్చి ఉంటారు."

డైనింగ్ హాల్ పక్కనే ఉంది. తన మాటలు ఒకవేళ ఎవరికైతే వినపడకూడదో ఆ మనిషికి వినపడతాయేమోనన్న సంకోచం కూడా లేకుండా ఇట్లా మాట్లాడుతున్నది తన కోడలేనా! అందమైనది. చదువుకున్నది. బాగా మాటకారి అని తాను మురిసిపోయాడే! తా నేం చేశాడు వీళ్ళకు అపకారం? ఎందు కీ వెగటు? కొడుకును చూడాలన్న ఆపేక్ష నిలవనియ్యలేదు. తెచ్చిపెట్టుకొని దగ్గారు. కృష్ణ కృష్ణ అని బిగ్గరగా ధ్యానించారు.

కొడుకు తన గదిలోకి వచ్చాడు. ప్రయాణం హాయిగా జరిగిందా నాన్నా అని పలకరించాడు. "ఆ బాగానే జరిగిందోయ్! రైలు దగ్గరకు నీ వొస్తా వనుకున్నాను. భయం కాదు కాని, బొంబాయి నగరం చూసి ఎప్పుడో ముప్పై నలభై ఏళ్ళయిపోయింది కదా!"

"వద్దామనే అనుకున్నాను. కాని రాలేకపోయాను" అని అయినా అంటాడేమోనని ఆశించారు రామబ్రహ్మంగారు. కాని, రాజగోపాలం అలా అనలేదు. "చూస్తావుగా రేపు. అసలు తాపీగా తిండి తినటానికి కూడా నాకు తీరిక ఉండదు. తెనాలి అనుకున్నావా బొంబా యంటే! మూడొందల తెనాలు లంత! బొంబా యంటే ఏమనుకుంటున్నావో! నీవు రెండు కాలేజీలు, ఒక సంగీత సభ, పేద విద్యార్థుల హాస్టలు, మునిసిపాలిటీ రాజకీయాలతోనే సతమతమైపోతుండేవాడివి. నాకలాంటివి

పదహారు సంస్థల పను లున్నాయి. కంపెనీ డైరెక్టర్ల మీటింగో, లయన్స్ క్లబ్బో, మా చార్టెర్డ్ ఎకౌంటెంట్స్ మీటింగులో ఉంటూనే ఉంటాయి. నలుగురు జూనియర్లూ, ఆరుగురు టైపిస్టులూ పని చేస్తున్నా నాకు తీరుబాటే లేదు" అన్నాడు రాజగోపాలం. అదంతా నిజమే కావచ్చు. కాని తనకు చెప్పాల్సిన విధం అదేనా? అనుకుంటే రామ బ్రహ్మంగారి మనసు మూలిగింది. తల్లి లేనేలేదు. తనను చూడాల్సిన తీరు ఇదేనా అనుకొంటే రామబ్రహ్మంగారి కళ్ళు తడి అయినాయి. మహాలక్ష్మి వెళ్ళిపోవటమే మంచిదైంది. లేకపోతే చాలా కష్టపడేది, ఈ పరిస్థితులకు తట్టుకోలేక అనిపించిం దాయనకు. కాని, మహాలక్ష్మి ఉంటే తన కెంత అండగా ఉండేది? తానిప్పుడు రెక్కలు విరిగిన పక్షిలా అయిపోయాడు కదా!

"పిల్ల లింకా ఇంటికి రాలేదా?"

"వాళ్ళు వచ్చేప్పటికి ఏ అయిదో అవుతుంది. ట్యూషన్‌కి వెళ్ళి, అటునుంచి సంగీత పాఠాలకు వెళ్ళి వస్తారు. నేను కూడా బయటకు వెళుతున్నాను. ఏ తొమ్మిదో పదో అవుతుంది. తాను కూడా నాతో వస్తుంది. షణ్ముఖానంద హాలులో డాన్సు ప్రోగ్రాం ఉంది. వెళ్ళక పోతే బాగుండదు."

రామబ్రహ్మంగారికి కళ్ళనీళ్ళ పర్యంతమైంది.

"మరి పిల్లలు ఇంట్లో ఉంటారా?"

"లేదు. మేము దారిలో వాళ్ళను పిక్ అప్ చేసుకొని పోతాం. నువ్వు రాత్రి భోంచెయ్యవు కదా నాన్నా! ఫలహారం తయారు చెయ్యమని చెబుతాను. టేబుల్‌మీద పెట్టేస్తుంది. ఈ ప్రోగ్రాం ఎప్పుడో పదిహేను రోజుల కింద ఒప్పుకున్నాను. లేకపోతే వెళ్ళేవాణ్ణి కాను" అని చెబుతున్నాడు రాజగోపాలం, ఏదో మొహమాటపడుతూ సంజాయిషీ ఇచ్చుకుంటున్న ధోరణిలో.

"నెలా పదిహేను రోజుల నుంచీ ప్రతి రెండు వారాలకూ నీకో ఉత్తరం రాస్తూనే ఉన్నాను కదా!" అనాలనిపించింది రామబ్రహ్మం గారికి. కాని అనలేకపోయారు. "మా నాన్నగారు మా ఊరినుంచి వచ్చారు. కాబట్టి నేను రాలేను" అని వాళ్ళకు కబురు చేస్తే ఎంత బాగుండును! కాని ఆ ధోరణి, ఆ సబబు, ఆ వాలకం కనిపించందే కొడుక్కు తా నేమని సలహా ఇస్తాడు! తాను బొంబాయి రాకుండా ఉంటే సరిపోయేది. కాని ఆశ చావక వచ్చాడు.

"సరే, సరే" అన్నారు ఇక ఏమీ అనలేక. జరుగుతున్న దంతా తలచుకొంటే ఆయనకు చాలా ఆశ్చర్య మనిపిస్తున్నది. తండ్రులూ కొడుకులూ ఇంత ఎడమైపోతారా! పల్లెటూళ్ళు పట్టణాలై గుర్తుపట్ట టానికే వీల్లేకుండా అయిపోయినట్లుగా ఉంది. ఇప్పు డేమనుకుంటే ఏం లాభం?

"బుధవారంనాడు నా తిరుగు ప్రయాణానికి టికెట్ రిజర్వ్ చేయించు. శుక్రవారం శాంతను చూస్తా మన్నారు పెళ్ళివారు. నీకు రాశాను కదా!" అన్నారు గొంతు పెగుల్చుకొని.

"సరే. మున్నాలాల్‌కి చెబుతాను" అన్నాడు కొడుకు.

"వచ్చేప్పుడు నీకు పళ్ళు ఏమైనా తెమ్మంటావా?" అని అడిగాడు.

అక్కర్లేదు అని చెప్పాలనిపించింది కాని, చెప్పలేకపోయా డాయన. మౌనంగా ఉండిపోయారు. "మీ కొడుకుతోపాటు మీకు టీ ఇవ్వనా మామయ్యగారూ! కాఫీ కావాలంటే కలుపుతాను" అన్నది కోడలు వచ్చి. తాను టీ తీసుకోడని కొడుక్కు తెలుసు. "ఏదీ అక్కర్లేదు" అన్నారు రామబ్రహ్మంగారు పొడిగా. "కాఫీ తీసుకొని రా!" అని రాజగోపాలం అంటాడేమోనని ఆశించాడు. "కొంచెం కాఫీ పట్టుకొని వస్తాలెండి" అని కదిలింది సంధ్య.

"నా కేమీ అక్కర్లేదు" అని విసుక్కుందామనిపించింది రామ బ్రహ్మంగారికి. కాని తండ్రి ముందు భయపడిపోయే పిల్లాడిలా అయి పోయింది రామబ్రహ్మంగారి పరిస్థితి. మరి తా నెప్పుడూ తన పిల్లలని భయపెట్టలేదే! ఇప్పుడెందుకిలా భయపడిపోతున్నాడు తాను? కొడుకూ, కోడలూ బయటకు వెళుతూ వెళుతూ మీరు కూడా రండి అనకపోగా, వస్తారా అని కూడా అడగలేదు. "ఇదుగో, ఆ గిన్నెలో చపాతీ లున్నాయి, కూర ఉంది" అని చెప్పింది కోడలు.

జనసంచారం లేని అడవిలోకి వచ్చినట్లుగా బాధపడిపోయారు రామబ్రహ్మంగారు. తాను ఇవాళే వచ్చాడు. ఇరుగూ పొరుగూ కూడా ఎవరూ తెలీదు. ఇది చిన్న ఊరు కాదు. ఇక్కడెవరూ ఆయనతో మాట్లాడేవాళ్ళు లేరు అని కూడా అనిపించింది కాదే కోడలుకు కాని, కొడుకుకు కాని అనుకుంటే ఆయన మనసు మూలిగింది.

ఆ రాత్రి అంతా నిద్ర పట్టలే దాయనకు. కొడుకూ, కోడలు ఇంటికి వచ్చేసరికి పది దాటింది. వయసూ, జ్ఞానమూ, లోకమూ, న్యాయమూ తెలిసిన, అధవా తెలియవలసిన కొడుకూ, కోడలూ ఇట్లా ప్రవర్తిస్తుంటే ఇక ఆ చిన్నపిల్లల గురించి ఏం తప్పు పట్టాలి? ఎందు కనుకోవాలి? రాత్రి ఇంటికి వచ్చేసరికి వాళ్ళ కళ్ళమీద నిద్ర జోగుతూ ఉండి ఉంటుంది. తాను వెళ్ళి వాళ్ళను చూడాలనిపించింది. తాతయ్య ఊరినుంచి వస్తే ఆ తరువాత మర్రోజు దాకా ఆ పిల్లలు చూడలేదు. ఇదేం లోకం? ఇదేం విడ్డూరం? మర్రోజు ఉదయం తాను చూశాడు జ్యోతిని, జ్యోత్స్నను. బాగా సాగారు. మూడేళ్ళయింది తాను వాళ్లను చూసి. వాళ్ళు తెలుగు చక్కగా మాట్లాడలేకపోతున్నారు. హిందీ యాస, ఇంగ్లీషు మాటలూ, నగరం వేష భాషలూ-తాతయ్యా, ఎప్పుడొ చ్చావు? అని కూడా సంబరంగా పలకరించలేకపోయారు. బామ్మను ఎరగనే ఎరగరు. ఒక్కసారి ఇలా చూసి అలా వెళ్ళిపోయారు.

కొడుకు ప్రవర్తన చాలా విచిత్ర మనిపించింది రామబ్రహ్మం గారికి. మర్రోజు పొద్దున తొమ్మిదింటికే బయటకు వెళ్ళాడు. నాన్నా, పన్నెండింటికల్లా వచ్చేస్తాను అని చెప్పాడు. రెండుదాకా రాలేదు. రెండురోజులు ఈ లంపటమంతా మానుకొంటే ఏంకొంపమునుగుతుంది? అనుకున్నారు రామబ్రహ్మంగారు. ఇప్పటికి తాను ఇక్కడకు వచ్చి మూడురోజులైంది. ఒక్క గంటసేపన్నా, తన ఎదురుగా, తన దగ్గరగా, తనకు కావలసినట్లు కొడుకుకాని, కోడలుకాని తనతో కబుర్లు చెప్పలేదు. తనతో అభిమానంగా ఆ విషయం ఈ విషయం మాట్లాడ లేదు. మనవరాళ్ళిద్దరూ తన వొళ్లో కూచోలేదు. అత్త ఎలా ఉంది? అత్తను తీసికొని రాకపోయినావా తాతయ్యా? అని మాట మాత్రంగా నైనా తనతో అనలేదు తన మనవరాళ్ళు.

ఆ మర్రోజంతా ఇంట్లోనే ఉన్నాడు రాజగోపాలం. అయితే ఏం లాభం? ఆఫీసు రూము కోర్టు హాలులాగా అయిపోయింది. ఎవ రెవరో వస్తున్నారు, పోతున్నారు. టెలిఫోను ప్రతి పదిహేను నిమిషా లకూ మోగుతోంది. టైపు మిషన్‌లు చప్పుడు చేస్తున్నాయి. రోజూ ఇంతమంది పార్టీలు వస్తారుటమ్మా? అని అడిగారు రామబ్రహ్మంగారు కోడల్ని. ఆమె కళ్ళు గర్వంగా మెరిశాయి. కోటీశ్వరులు, వజ్రాల వర్తకులు, సినిమావాళ్ళు వస్తారుట. చంపకలాల్ హరిమోహన్‌లాల్ బొంబాయిలో కల్లా పెద్ద మిల్లు వర్తకుడు. కోటీశ్వరుడు. అతడి దేమిటో వాజ్యం నడుస్తోందిట. వారానికి నాలుగురోజులు మీ కొడుకు ఇంటి దగ్గర భోజనం కూడా చేయరు అని చెప్పింది కోడలు.

రామబ్రహ్మంగారికి కొడుకు ప్రవర్తన చూసి మనసు గాయ పడింది. తాను అప్రయోజకుడు కాడు. రెండు చేతులా సంపాదించాడు లాయరుగా. ఊళ్లో ఎన్నో ధర్మసంస్థలు నిర్వహించాడు. పేద విద్యా ర్థులకు హాస్టలు నడిపించి, లెక్కలన్నీ సొంతంగా రాసుకున్నాడు. చూసుకున్నాడు. కాలేజీ ఛెయిర్మన్‌గా పదేళ్ళు దాని బాగోగులు

చూశాడు. ఆ రోజుల్లో ఊళ్లో సభలకీ, సన్మానాలకీ అధ్యక్షుడు తానే. ఏభై ఏళ్ళు ఆ విధంగా ఊరంతా తన కుటుంబమే అనుకున్నాడు. మహాలక్ష్మి మంచి మనస్సూ, తోడు-నీడ లేకపోతే తాను అసలు మన గలిగేవాడా? తన జీవితం ఎంత ఉల్లాసంగా, ఉరుకుల పరుగులుగా నడిచింది! ఒక్క రోజయినా 'ఇంట్లో ఇది ఉంది, అది లేదు, ముందు రోజు లెట్లా గడుస్తాయి? మీ రిట్లా ఖర్చుపెడితే ఎట్లా?' అని హెచ్చరిం చిందా, విరస వాక్యాలు పలికిందా తన ఇల్లాలు! దేశ సేవ అంటూ ఇల్లు పట్టించుకోకపోయినా ఏనాడూ సాధించలేదు. వేధించలేదు. ఎప్పుడూ కల కల లాడుతూ ఉండేది. నలభై ఏళ్ళ తరువాతే అసలు జీవితం ప్రారంభం కావడం వల్ల పిల్లలు ఆలస్యంగా పుట్టారు. పిల్లల కోసం డబ్బు దాచుకోవాలని మహాలక్ష్మి ఏనాడూ చెప్పలేదు. తాను అలా ఆలోచించనుకూడా లేదు. నలుగురు పిల్లలు పుట్టారు. పెద్దవా ళ్ళిద్దరూ మగపిల్లలు. చిన్నవాళ్ళిద్దరూ ఆడపిల్లలు. పెద్ద కొడుకు తన లానే లాయరైనా బాగా రాణించలేకపోయినాడు. పెద్దలు సంపాదించిన ఇల్లు ఉంది కాబట్టీ తాను ఇచ్చిన అనుభవం ఉంది కాబట్టీ ఎలాగో సంసారం వెళ్ళదీసుకొని వస్తున్నాడు. రెండోవాడు ప్రయోజకుడు. చదువు సంధ్యల్లో మొదటినుంచీ చురుకుగా ఉంటూ వచ్చాడు. పెద్ద సంబంధం వచ్చిందని మహాలక్ష్మి మురిసిపోయింది. పెద్ద కూతురికి మంచి సంబంధమే చూసి ఇచ్చారు. ఇక ఒక శాంత పెళ్ళికి ఉండి పోయింది. ఏమిటో ఏ సంబంధం కుదరలేదు. అలానే ఆలస్యం జరిగి పోయింది. పాతికేళ్ళు వస్తున్నాయి. ఇప్పు డదే తనకు పెద్ద బెంగై కూచుంది. తన ఇల్లాలు మహాలక్ష్మి ఉంటే తన కిన్ని కష్టా లుండేవి కావు. ఆవిడకు బంధువులలో ఇరుగు పొరుగులలో ఆదరణ ఉండేది. అభిమానం ఉండేది. ఇన్నాళ్ళు ఈ సమస్యను నలగనిచ్చేదే కాదు.

రేపే బుధవారం. ఆరురోజు లెట్లా గడిచాయో గడిచేపోయాయి. ఒక్క రోజైనా కొడుకు తనకోసం ఇంట్లో ఉండలేకపోయాడు. ఉన్నా

తనతో గడపలేకపోయాడు. రెండు కార్లున్నాయి. "బొంబాయిలో చూడాల్సినవి చాలా ఉన్నాయి,చూపిస్తాను నాన్నా!" అనలేకపోయాడు. ఇంటి కెందరో వస్తూ పోతూ ఉంటే ఈయన మా నాన్నగారు అని వాళ్ళకు పరిచయం చేయనేలేదు. రెండు మూడు వార్తాపత్రికలను ఎన్ని సార్లని చదువుతాడు? తనకెంతో ప్రియమైన తెలుగు వార్తాపత్రికను తెప్పించలేకపోయాడు. తాను చెప్పొడు తెప్పించరా అని కూడా.

ఇక రేపు తాను ఎలాగూ ఊరెళ్ళిపోతున్నాడు. మళ్ళీ వీళ్ళ దగ్గరికి రావటం ఉంటుందా? రావాలనుకోవటం లేదు. ఆ రాత్రి భోజ నాల దగ్గర కొడుకును కదిపాడు. "ఏమిరా గోపాలం! శుక్రవారం గుంటూరు నుంచి పిల్లను చూసుకోవటానికి వస్తున్నారు. పిల్లవాడికి మంచి ఉద్యోగం. తండ్రి కూడా బాగా గడిస్తున్నాడు. నేను కూడ బెట్టింది ఏమీ లేదు. అన్నయ్యకి కూడా ముగ్గురు పిల్లలు. అతడు సంపాదించి నిల్వచేసింది ఏమీ లేదు. నా ఆశ అంతా నీమీదే పెట్టుకుని వచ్చాను. మీ అమ్మ ఉంటే నా కీ చిక్కు వచ్చేది కాదు. నీ కట్నం విషయం కూడా నేనేమీ పట్టించుకోలేదు. ఏమంటావు?" అన్నారు రామ బ్రహ్మంగారు బెరుకు బెరుకుగానే.

కోడలు మాట్లాడుతుందని రామబ్రహ్మంగారనుకోలేదు. ఆమె అంత చక్కగా వాదించగలదనీ ఆయన అనుకోలేదు. "చూడండి మామయ్యగారూ! ముప్పై ఏళ్ళుగా మీరు బావగారితోనే ఉంటున్నారు. మీ సంపాదనంతా ఆయనే వాడుకుని ఉంటారు. మా కిద్దరూ ఆడపిల్లలే కదా! ఈ కాలంలో ఆడపిల్లకి తగిన సంబంధాలు తేవాలంటే, వాళ్ళు అనువుగా కాపరాలు దిద్దుకోవాలంటే ఎంత సమస్యో మీకు తెలీని దేమీ కాదు." నీవు మాట్లాడకు అని భర్త హెచ్చరించినా ఆవిడ వినలేదు. "రేపొద్దుట మాట్లాడదాంలే నాన్నా!" అన్నాడు రాజగోపాలం.

ఆ రాత్రి అంతా రామబ్రహ్మంగారికి కునుకులేదు. చిన్నప్పటి సంగతులన్నీ గుర్తుకు వచ్చాయి. ఎంత పొద్దుపోయి ఇంటికి వచ్చినా

గోపి తన పొట్టమీద పడుకోబెట్టుకుంటే కాని నిద్రపోయేవాడు కాదు. కనపడితే ఒక్క క్షణం వదిలేవాడు కాదు. కాళ్ళు చుట్టుకొని బయటకు అడుగు పెట్టనిచ్చేవాడు కాదు. అయిదారేళ్ళ వయసున అయితే తాను ఇల్లు చేరిందాకా నిద్రపొయ్యేవాడు కాదు. ఒక రోజున తను ఇల్లు చేరుకునేసరికి పదకొండు దాటింది. ఆ రోజు బాగా గుర్తు. వేసం కాలం. తన పొట్టంతా తడిసిపోయేలా ఏడ్చాడు గోపి. "నాన్నా, ఎందుకురా ఏడుపు?" అని గుచ్చి గుచ్చి అడిగితే, "మధు వాళ్ళ నాన్న చచ్చి పోయాడు కదా నాన్నా, మధుకెట్లా పాపం!" అని నోట్లో చేయి కుక్కుకుని ఏడుపు ఆపుకున్నాడు. పదేళ్ల వయసు వచ్చేదాకా వీథిలో ఎక్కడైనా, ఎప్పుడైనా కనపడినప్పుడల్లా పరుగున వచ్చి తన చేయి పట్టుకుని గారాం చేసేవాడు. అలాగే మధుకోసం రెండు మూడు రోజులు ఏడ్చాడు. అప్పుడు గోపీ ఆర్తి తనకు అర్థమైంది. ఆ పసి మనసులో అర్థం కాని అందోళన. అనూహ్యమైన భయం. సత్యనారాయణగారు తమ వీథిలోనే ఉంటారు. ఆయన కూడా లాయరే. హఠాత్తుగా చని పోయాడు. శవం కదిలిందాకా తానూ, మహాలక్ష్మి అక్కడే ఉండి వచ్చారు. పనిమనిషితో తల్లి చెప్పిన మాటలన్నీ విన్నట్లుంది గోపి. తనను గట్టిగా కరచుకొని పొట్ట తడిపేసేవాడు. ఎంత చోద్యం! ఇప్పుడు నాన్న నాన్న కాడా?

మర్రోజు ఉదయం శాంత పెళ్ళి ప్రస్తావన మళ్ళీ తెచ్చారు రామబ్రహ్మంగారు. "సాయంకాలం అయిదున్నరకి మున్నాలాల్ వచ్చి రైలెక్కిస్తాడు నాన్నా, నేను మధ్యాహ్నం ప్లైటులో బెంగుళూరు వెళ్ళాల్సి" ఉంది అని చెప్పాడు కొడుకు. కాబట్టి అదే సమయం-మరి తనకు కొడుకుతో మాట్లాడే వ్యవధానం కూడా దొరక్కపోవచ్చు. డ్రాయింగు రూంలో కూచుని కాఫీ తాగుతుండగా రామబ్రహ్మంగారు ఈ విషయం ప్రస్తావించారు. "ఇదుగో, ఒకసారి ఇలా రండి" అని సంధ్య డైనింగ్ రూములోంచి భర్తను పురమాయించింది. తాతవైపు

అమాయకంగా చూసి చిరునవ్వులు చిందించి మనవరాళ్ళు స్కూలుకు బయలుదేరారు.

"నాన్నా! ఇప్పుడు నా దగ్గర డబ్బు లేదు. నీవేమీ అనుకోవద్దు. నీ ఇబ్బంది నాకు తెలీకపోలేదు. మీ కోడలంటోంది కదా-ఈ గొలుసు నివ్వండి మామగారికని."

రామబ్రహ్మంగారు నిశ్చేష్టుడైనారు. "దాన్ని నేను ఏం చేసుకుంటానురా దౌర్భాగ్యుడా?" అన్నారు. "నా బాధ లేమిటో మీకు వివరంగా జవాబు రాస్తాను లెండి. నా కిప్పుడు జుహూలో కాన్ఫరెన్సు ఉంది. కింద కారు రెడీగా ఉంది. మున్నాలాల్ అయిదింటికల్లా మిమ్మల్ని స్టేషన్‌కు తీసుకొని వెళ్తాడు" అంటూ రాజగోపాలం గబగబా వెళ్ళిపోయినా డక్కడనుంచి.

తెనాలిలో రైలు దిగి మర్రోజు తొమ్మిదిన్నర గంటలకు పాత కాలపు మండువా లోగిలి 'సత్యం శివం సుందరం' మెట్లెక్కి ఎత్తైన వరండాలో కాలుపెట్టిన తండ్రిని చూసి శాంత కొయ్యబారిపోయింది. ఆయన్ను అంత అలసిపోయిన వాడిలా దిగులుపడ్డ వాడిలా సర్వస్వం కోల్పోయిన వాడిలా ఆ పిల్ల ఎప్పుడూ చూడలేదు. "నాన్నా, నీ గొడుగేదీ?" అంది శాంత గబుక్కున. ఆయన ఏదో చెప్పబోయారు కాని మూతి వంకర తిరిగిపోతోంది. నాలుక ముద్ద కడుతోంది. చెమటలు కారిపోతున్నాయి. కళ్ళనిండా నీళ్లు కమ్మాయి. చప్పున పోయి పడిపోకుండా తండ్రిని కావలించుకుంది శాంత. పెద్ద కొడుకూ, కోడలూ, మనవలూ ఏమిటేమిటని కంగారు పడుతూ వచ్చారు. కాని! ఏమిటి జరిగిందో ఒక్క శాంతకే తెలుసు.

(ఆంధ్రప్రభ - 1991)